## కథ

# పూర్ణాలమ్మ

కట్టుకోలు సుబ్బారెడ్డి

"పూర్ణమ్మగారూ! పూర్ణమ్మగారూ!"

"ఎవర్రా ఆ నెలతక్కువ వెధవ? ఏమిటా పిలుపూ?"

"నేనండీ... కూష్మాండ శాస్త్రిని"

"నువ్వట్రా శాస్త్రీ... కొంచెంసేపలా ఉండు వస్తున్నా. మడిలో ఉన్నాలె"

"......."

"ఆ ఏమిట్రా శాస్త్రీ? ఆ పిలుపేమిటీ! ఆ లోకమేమిటీ! పిచ్చిపిలుపూ నువ్వూనూ. పూర్ణాలమ్మేవిట్రా నీ శ్రాద్ధం, చక్కహా పూర్ణమ్మగారూ అనలేవూ. యజ్ఞం చేసిన మా నాయనగారు నా బారసాల నాడు పెట్టిన అసలు పేరు 'పూర్ణాహుతమ్మ'. అంత స్వచ్ఛోచ్ఛారణ చేయలేని నీలాటి నాప సన్యాసులు మాత్రమే 'పూర్ణమ్మ' అనేవారు. నా చిన్నతనానే ఇల్లుపట్టిన మా పెద్ద మేనత్తకు నోరు తిరిగిచావక పూర్ణం అని పిలిచేది! అదీగాక నేను పూర్ణం బూరెలూ అవీ బాగా చేస్తానేమో అందుకని కొందరు నన్ను నా వెనుక 'పూర్ణాలమ్మ' గారంటార్ట నా మనవడు ఆమధ్య నాతో చెప్పేళ్లె.

"......."

"వాళ్లంటే ఏదో తెలియకో నోరుతిరిగి చావకో అంటున్నారనుకో నీకేం పొయ్యేకాలమొచ్చిందిరా నిన్ను పొయ్యిలో పెట్టా. అదీగాక కొంతకాలం వేదపాఠశాలలో అఘోరించినట్లున్నావుగా? నీ మొహం ఈడ్చా. ఆ పాఠాల సారమంతా యేమయ్యిందిరా?"

"అమ్మో! అమ్మో! ఇక ఆపుదురూ, మీ దీవెనలూ మీరూనూ, వినలేక చస్తున్నా. నేను పూర్ణమ్మగారనే అన్నాను. మీకు పూర్ణాలమ్మలాగా వినిపించి ఉంటుంది. నేను 'పూర్ణాలమ్మ' అని ఎందుకంటానండీ?"

"ఒరే కూష్మం ఇప్పటికిప్పుడు 'పూర్ణాలమ్మ, పూర్ణాలమ్మ' అని రెండుసార్లన్నావు. మళ్లా నేనెందుకంటానండీ అంటూ దీర్ఘాలు తీస్తున్నావు. తిక్క వెధవా! వచ్చినపని చెప్పి చావు. అసలు గడచిన పక్షంరోజులుగా నీ కోసమే ఎదురుచూస్తున్నా. తీర్థయాత్రలకో నీ శ్రాద్ధానికో వెళ్లావని చెప్పారు. ఊళ్లోకి ఎప్పుడు తగలడుతావా అనిన్నూ... నా చేతికి ఎప్పుడు దొరుకుతావా అనిన్నూ, నీకు బడితపూజ ఎప్పుడు చేద్దామా అనిన్నూ... ఇంకా నీ బుర్ర రామకీర్తన ఎప్పుడు పాడిద్దామా అనిన్నూ చూస్తున్నాను"

"ఏం జరిగిందండీ అత్తయ్యగారూ? ఏదో జరిగే ఉంటుందిలెండి! లేకపోతే అంతలా విరుచుకుపడరు. నా మీద అలవిమాలిన కోపమొచ్చినట్లుంది? ఒళ్లు పెట్టుగా తిడుతున్నారు!"

"అత్తయ్యగారూ, దుత్తయ్యగారూన్ను. ఎదురుగా బాగానే అఘోరిస్తున్నావు, చాటుగానేమో చుప్పనాతి పనులు చేస్తున్నావు. అసలు నీలాటి పింజారీ వెధవని నమ్మటం నాదే తప్పు, అసలు నిన్ను నమ్మ..."

"నాకివ్వాళ బ్రతికి బట్టకట్టే యోగం లేనట్లుగా ఉందే మీ వరుస చూస్తుంటే! ఇంతకూ అసలేమయ్యిందండీ!"

"ఏమయ్యిందా? ఏ...మ...య్యిం...ద...ని అడుగుతున్నావా? ఎంత గుండెలు తీసిన బంటువురా? మా కాముడి జతగాడితో ఏమేమి చెప్పావో అప్పుడే మరి చావా?"

"మీ మనవడి జతగాడా ఏదీ ఆ పార్థుడా వాడసలే అపార్థుడండీ మీతో ఏమీ చెప్పి చచ్చాడో ఏమి పాడో, అదిప్పుడు నా చావుకొచ్చింది, అయినా నేనేం చెపుతానూ? ఎందుకు చెపుతానూ? మీరే చెప్పండి"

"ఎందుకా! పార్థుగాడికి తెలిపిన విషయమేదయినా మరుక్షణం వాడు మా కాముడికి చెపుతాడు. కాబట్టిన్నీ వాడి మాట వీడు 'తూచా'లు తప్పక వింటాడు కాబట్టిన్నీ ఇంకానేమో... అయినా అబద్ధాలు చెప్పకొరేయ్. ఇప్పటికే ఆరుగురాడ పిల్లలున్నారు. పెళ్లిళ్ల పేరయ్య మా కాముడుకి తెచ్చిన సంబంధాలు నీవు చెడగొట్టాలని చూడలేదూ? చెడగొట్టేవేకాదూ? అమలాపురం నుంచి ఏడు వారాల నగలతో పిల్లనిస్తామని వచ్చిన వాళ్లపిల్లకు ఏడువారాల కదుపని చెప్పలేదూ? భీమవరం పిల్లకు బొల్లి అనీ, నిడదవోలు పిల్లకు నత్తి అనీ, పార్థుగాడికి చెప్పలేదూ?"

"ఆరుగురాడ పిల్లలెక్కడండీబాబు! ముగ్గురే కదండీ! నా ప్రాణానికి మళ్లా ఇదొక తంటా తెస్తున్నారు. మీరు వేస్తున్న ఈ అభాండం కాస్తా ఆ నోట ఆ నోట మా ఆవిడకు గానీ చేరిందా నా పని గో..హో..విందా, అది అసలే దూర్వాస సంతతికి చెందినది కూడానూ!"

"ఒరే కూష్మం పెళ్లికూతుళ్ల గురించి నేను చెపుతోంటే ఆ నంగతి విడిచి మాటవరుసకు ఆరుగురాడ పిల్లలన్న దాన్ని పట్టుకుని వేల్లాడుతావేంరా! అసలు విషయాన్ని దాటెయ్యడానికిగానూ ఎత్తువేస్తున్నావన్న మాట?"

"అదా...అదీ...అదికాదండీ..."

"ఏది కాదురా? ఏది కాదు. అంట్లవెధవా. చంపేస్తానొరేయ్. నోరు ముయ్యి ముందు. ఒరే ముందు నోరు ముయ్యి. ఒరే ముయ్యి నోరు ముందు..."

"పూర్ణమ్మత్తయ్యగారూ, మీ మాటల పోడిమి చూడగాచూడగా మీ పక్షీయులెవరో ఘనాపాఠీలని అనిపిస్తోంది సుమండీ"

"మధ్యలో ఈ ఘనాపాఠీల గొడవేమిట్రా? తప్పించుకోవాలని చూస్తున్నావా! అలా కుదరదు. ఈవేళ అటో ఇటో తేలిపోవాలి"

"తేల్చుదురు గానీలెండి.. దానిదేముందీ! ముందీ మాట చెప్పండి. మీ పూర్వీకులెవరూ ఘనాపాఠిలో, ఇతరత్రా వేరే శాస్త్ర పండితులో కాకుంటే మీ మాటలో వినిపిస్తున్న చిత్రమైన ఆ నాదం, తూగూ, ఆక్రమమైన వరుసా ఎలా వస్తాయి చెప్పండి. పెద్దవారెవరో వేదశాస్త్రాలో, మంత్రశాస్త్రాలో పాఠం చెప్పుకునేటప్పుడో, వల్లె వేసేటప్పుడో చర్చించేటప్పుడో మీరు తరచుగా గానీ అథవా ఆడపాదడపాగానీ అవి విని ఉంటారు. మీకు తెలియకుండానే మీ మాటలలో ఆ ధోరణే బహుళంగా కనిపిస్తుంది. వినిపిస్తోంది కూడాను. మీ తిట్లలో కూడా ఓ స్వరం వినిపిస్తుంది. అందుకు మీ పూర్వీకులు ఘనాపాఠీలని అనిపిస్తుందని అనగలిగానుస్మండీ. కాదంటారా చెప్పండి"

"ఒరే అండం ఎలాగయినా నువ్వు గడుసు వెధవ్వి. ఎలాగో ఓలాగ మా పూర్వుల పాండిత్య ప్రతిభా విశేషాలు తెలుసుకొని ఉంటావు. ఇప్పుడా విషయాలు డొంక తిరుగుడుగా ఏకరువు పెడుతున్నావు. నిన్ను నమ్మకూడదు బాబూ!"

"అంతేలెండి. నిజం చెపితే నిష్ఠూరమంటారు. ఇంకా సేపాగితే నేను మిమ్మల్ని పొగుడుతున్నానని అన్నా అంటారు"

"ఓరి నీ ఇల్లు బంగారంగానూ, నేనలా ఎందుకంటాన్రా కూష్మం, నీ సంగతి చిన్నప్పటి నుంచీ నేనెరుగనిదేమన్నా ఉండి చచ్చింది గనుకనా! నువ్వు గుడ్డల్లేకుండా గోళీకాయలాడే దగ్గర నుంచీ కరణంగారి తోటలో మామిడికాయలు తెంపుకు పోవడం, ఆ లక్ష్మణాచా


ర్యులు పంతులు నీ చేత గోడకుర్చీ వేయించడం, నీ బండబడ, ఇవన్నీ నేనెరుగనివా ఏమిట్రా? అవన్నీ సరేగానీ . ఒరే అలా ఆ కుర్చీపీట లాక్కొని శుభ్రంగా దానిమీద కూర్చో. ఈ లోపుగా నేను కాస్త దిబ్బరొట్టె తెస్తాను నోట్లో వేసుకుందువుగానీ'' అంటూ లోనికెళ్లింది.

"బామ్మా! బామ్మా! ఎక్కడే బాబూ! చస్తున్నా నీ చెవుడుతో?" అంటూ వచ్చాడు కాముడు.

"ఆ రావోయ్ అల్లుడూ రా.. మీ బామ్మ ఇప్పుడే వంటింట్లోకెళ్లిందిలే"

"మీరా మావయ్యగారూ ఎంతసేపయ్యిందీ వచ్చి? ఊళ్లో లేరటనే? తిరుపతి యాత్రకెళ్లారని మొన్నా మధ్య ఎవరో అన్నారు. ఎవరు చెప్మా? మా బామ్మయి ఉంటుంది? వారాల శంకరం గానీ అన్నాడా? లేక మీ సుబ్బు చెప్పిందా? ఎవరైతే ఏమయ్యిందిలెండి. ఆ సరే ఎపుడొచ్చారే మిటి? అంతా క్షేమమే గదా? యాత్ర బాగా జరిగిందా? చూడవలసిన వన్నీ చూశారా? మరేమీ ఇబ్బందులు పళ్లేదు గదా? వెళ్లేటప్పుడు మాటవరుస కన్నా చెప్పేరు కారేమండీ? అత్తయ్యను తీసుకెళ్లొచ్చు గదా? బోలెడు డబ్బు వ్యయమవుతుందనుకుంటారు? ఔనా మావయ్య గారూ?"

"ఆ.. ఆ.. ఆగవయ్యా అల్లుడూ అలా ప్రశ్నమీద ప్రశ్న వేస్తే సమాధానం చెప్పగలమటయ్యా? కాస్త ఊపిరి తీసుకో, అలా మాట మీద మాట అనటం అటు మీ బామ్మకే చెల్లింది. ఇటు నీకే చెల్లింది. అయినా ఎక్కడ



పోతాయా లక్షణాలు?"

''అది కాదండీ. ఊళ్లో లేరన్నారూ... ఎప్పుడొచ్చారోనని"

"ఊళ్లో లేని మాటా నిజమే, తిరుపతి యాత్రకెళ్లిన మాటా నిజమే. మా బావమరిదిన్నీ ఇంకా వాళ్ల ఊరివాళ్లు తిరుపతీ, రామేశ్వరం వగైరాలు చూడడానికి వెళుతూ నాక్కూడా కబురు పెడితే వెళ్లొచ్చానోయ్. ఏదీ ఊళ్లోకొచ్చిన వ్యవధానం లేదు, దొడ్డమ్మగారు ఒకటికి రెండు మారులు వర్తమానించారూ ఆవటా? ఏమి పనో ఏమిటో వెళ్లం దెళ్లండంటూ మీ అత్తయ్య ఊపిరి సలుప నిచ్చిందటోయ్. దాని సిగదరగ. నువ్వు నమ్మవుగానీ అల్లుడూ.. అలా స్నానం చేశానో లేదో ఇలా వచ్చి పడ్డా"

''అలాగయితే మా బామ్మకు కనబడ్డారన్న మాట"

"ఆ..ఆ..కనబడ్డాను నాయనా...కనబడ్డాను. కనబడ్డమూ అయ్యిందీ, అక్షింతలు వేయించుకోవడమూ అయ్యింది. ఏదో అప్పటికప్పుడు ఒక యుక్తి చేసి తాత్కాలికముగా బయటపడేటప్పటికీ...ఉష్ష్...నేను పుట్టక ముందే కాలం చేసిన మా నాయనమ్మతో సహా వరుసగా మా పెద్దలందరూ కనబడ్డారు"

"ఏమయ్యిందండీ"

"ఆ ఇదిగోరా శాస్త్రీ...మరీ... ఒరే కాముడూ సమయానికి నువ్వు కూడా వచ్చేవే! నీకు కూడా కాస్త దిబ్బరొట్టె తెస్తాన్రా నాయనా పుచ్చుకుందువు గానీ"

"దిబ్బా వద్దు దిరుగుండమూ వద్దే బామ్మా!"

"అయ్యో అదేమిట్రా... చోద్యం బోతావూ, ఇదేమన్నా నిషిద్ధ పదార్థమా? మీ తాతగారు ఎంచక్కా నెయ్యి వేసిన దిబ్బరొట్టె పుచ్చుకునేవారు. పూర్ణా దిబ్బరొట్టె బాగుందేవ్ ఆవటా అనేవారు.! అందునా ఇవ్వేళ రొట్టె బాగా కుదిరింది. మా నాయన కదూ! కొంచెం తెస్తాను. దాన్తోపాటు కాస్త ఆవకాయ ఊట తేనా? లేకపోతే అల్లం పచ్చడి తెమ్మంటావా?"

"ఆవకాయా వద్దూ, అల్లం కషాయమూ వద్దు నేనిప్పుడే అయ్యరు దగ్గర పెసరట్లు తిన్నానే"

"ఒరే డబ్బు తగలేసి ఆ బజారు తిళ్లు తినబోకురా నాయనా నీకు పుణ్యముంటుంది. డబ్బుంటే ఆ మహారాజు మీ తాతగారు రెండు మూడు తరాలకు సరిపడా గడించి పోయారు గనుక ఇబ్బంది లేదు. ఆరోగ్యం పాడు చేసుకుంటావేమో ననేదే నా అసలు బాధ. నిన్ను చూద్దామా అంటే అసలే అర్భకుడివి. రేపేదైనా బేదుల్లాటివి పట్టుకున్నాయంటే చచ్చేవావు. నేనా లోగడ లాగా చెయ్యలేకపోతోన్నానయ్యో. నీ నెత్తిన ఆ నాలుగు గింజలూ పడితే నేనిక కృష్ణా రామా అనుకోచ్చు. అయినా ఒరే... నా తాపత్రయమే గానీ కక్కొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగవంటారు. ఆ ఘడియ రావాలని ప్రార్థన చెయ్యడం తప్ప ఇంక నాకేం కావాలి చెప్పు! ఏరా శాస్త్రీ నువ్వేమంటావు? అంతకంటే ఏం కావాలీ చెప్పు?"

"మరీ ఈ దిబ్బరొట్టెలకి కొంచెం తేనెపానకముంటే తెచ్చిపెడుదురూ!"

"ఒరే అందం నేను చెప్పేదేమిటీ నువ్వు చెప్పేదేమిటీ, పెళ్లిళ్ల విషయం నేన్చెపుతోంటే నువ్వు తేనె పానకమంటావేమిట్రా అంట్లవెధవా? నీకు చింతతొక్కు వేశానుగా? అయినా నీకంత ఆశ కూడదొరేయ్... అదే అంత జిహ్వా చాపల్యం కూడదొరేయ్. పెద్దముండాదాన్ని ఎందుకు చెపుతున్నానో తెలుసుకో"


"అమ్మా దిబ్బరొట్టె తింటున్న పరాకులో ఉండి ఏదో మాట్లాడబోయి ఏదో మాట్లాడాను. మీరు దిబ్బరొట్టెలోకి అనుపానంగా అల్లుణ్ని అడిగారే అల్లమా ఆవకాయా అని అలా నన్ను కూడా అడిగారేమోననుకున్నానండీ! అందుకనే తేనెపాకం తెమ్మన్నాను"

"ఊ.. ఏదోఒకటి అఘోరించావులే, అయినా అల్లుడూ గిల్లుడూ అంటూ ఆ వరుసలేమిట్రా అందం. అలాటి ఆశలేవన్నా ఉంటే మానుకో. ఈ ఏటికి మా కాముడికి పెళ్లి చేయబోవడం లేదు. ఏమంత వయసు మీరింది గనుక. అల్లుడట అల్లుడు, ఊ...ఊ...ఇక నువ్వు దయ చెయ్యొచ్చు"

* * *

"బామ్మా మరీ రానురానూ నీకు మతిపోతోందే. పాపం కూష్మాండం మామయ్య ఇప్పుడేమన్నాడనే? అంత చిన్నబుచ్చి పంపావు? అల్లుడూ అంటే ఇప్పుడేమయ్యిందేమిటి! నేను మావయ్యా అంటే తను అల్లుడూ అంటున్నాడు. నిన్నేమో అత్తయ్యగారూ అంటున్నాడు. ఈమాత్రానికే అలా అనాలేమిటే?"

"ఒరే కాముడూ నన్ను గురించీ మన వంశపు ఔన్నత్యాన్ని గురించీ నీకు పూర్తిగా తెలీదు. నా పుట్టినింటివైపూ మెట్టినింటివైపూ అందరూ నిప్పులు కడిగే ఆచారవంతులు. అత్యధికులు వేదపండితులూ, మంత్రవేత్తలూ, సిద్ధాంతులున్నూ. మా నాయనగారు స్వయంగా యజ్ఞం చేసినవారు. మీ తాతగారిని చూద్దుమా వారు ఘనపాఠి, పరమనిష్ఠాగరిష్ఠులు, స్నానమూ జపమూ కానిదే పచ్చి మంచినీళ్లు కూడా ముట్టేవారు కారు. ఇక మీ నాన్న ఉభయభాషా ప్రవీణుడు. ఆ రోజుల్లో ప్రతి పరీక్షలోనూ మీ నాన్నే ప్రథముడుగా వచ్చేవాడు. అలాంటి వంశంలో పుట్టిన నీకు తన కూతుర్నిచ్చి నిన్ను తన అల్లుడిగా చేసుకోవాలని ఈ ముష్టి కూష్మాండ శాస్త్రి దురాలోచన. వీడి తాహతుకు తగినదే వీడి ఇంటి పేరు కూడాను. మనసు అంతరాంతరాల్లో ఉన్న ఆలోచన మాటల రూపం బయటికొస్తుందనేది శాస్త్రమంగీకరించే విషయమేనాయె! ఈ శాస్త్రి మనసులో వాడి పెద్ద కూతుర్ని నీకిచ్చి చేసి నిన్ను అల్లుణ్ని చేసుకోవాలని ఉంది. అదే కోరిక మారువేషం వేసుకొని తేనె పానకం అడగడంగా బయటికొచ్చింది. ఇందులో నాకు తెలియనిదేమీ లేదు. వాడి తాహతుకు చింతతొక్కు చాలు గాక చాలు"




"ఏమోనే బామ్మా మరీ గాలిపోగు చేసి నువ్వు లేని పోనివన్నీ ఊహిస్తున్నావేమోనే"

"ఒరే కాముడూ నోరుమూసుకో.. నన్ను మరీ వెర్రిబాగులదానిగా జమకట్టబోకు. నిన్ను కని మీ అమ్మ పురిట్లోనే పోయింది. ఆ దిగులుతోనే మీ నాన్న అకాల మరణం పాలయ్యాడు. కొడుకునీ కోడలునీ పోగొట్టుకున్న నేను మగ ఆలోచనా ఆడ ఆలోచనా కూడా నేనే చేస్తూ పసిగుడ్డువైన నిన్ను సాకి సంతరించి ఇంతవాణ్ని చేశాను. ఆస్తిపాస్తుల సంరక్షణ కోసం ఎంత పరిశ్రమ చేశానో ఆ పరాత్పరుడికే తెలియాలి. అలాంటి నేను లేనిపోనివన్నీ ఊహిస్తున్నానా? అంతే కాదొరే.. నువ్వు ఇటీవల అవసరమైన దాని కంటే ఎక్కువసార్లే ఆ శాస్త్రి ఇంటికి వెళుతున్నావనీ మన ఇంటి దగ్గర ముట్టుకోను కూడా ముట్టుకోని జామపిందెలని వాళ్ల ఇంటి దగ్గర బాగున్నాయని తింటున్నావనీ ఆ సుబ్బలక్ష్మితో ఎడతెగని ఆలోచనలు చేస్తున్నావనీ నాకు తెలియదనుకోకు"

"ఏమిటే నీకు తెలిసింది? ఏదో ఒకటి రెండుసార్లు వాళ్ల ఇంటివైపుగా వెళ్లాను. ఒకసారో, అరసారో సుబ్బుతో మాట్లాడాను. అది కూడా పే...ద్ద తప్పేనా ఏమిటే?"

"తప్పా తప్పున్నరా! పెళ్లి గాని పిల్లతో అంతంత సేపు ఏముంటాయిరా నీకు రాచకార్యాలు..హవ్వ.. ఎంత అప్రతిష్ట...ఎంత అప్రతిష్ట. నలుగురూ నాలుగు రకాలుగా అనుకోరూ! అయినా మన తాహతెక్కడ? వాళ్ల తాహతెక్కడ? మన సాంప్రదాయమెక్కడా! వాళ్ల సాంప్రదాయమెక్కడా! ఆ కూష్మంగాడి మేనత్తకు ఎక్కడా గతి లేక ఆఖరుకు శాఖాంతర వివాహం చేశారు ఎరుగు




# సిగరెట్ మానేసిన ప్రిన్స్

మహేష్ బాబు నటించిన చిత్రం రిలీజై దాదాపు మూడేళ్లవుతున్న మాట అటుంచితే ఓ శుభవార్త చెబుతున్నాడాయన. దాదాపు ఏడాది కాలంగా మహేష్ సిగరెట్ తాగటం మానేశాట్ట. స్కూలుకెళ్లడానికి రెడీ అవుతున్న మహేష్ కొడుకు గౌతమ్- ఇప్పుడిప్పుడే ముద్దుముద్దుగా తెలుగు, ఇంగ్లీషు, హిందీ, మరాఠీ (తల్లి నమ్రతా భాషన్నమాట) నాలుగు భాషల్లోనూ మాట్లాడేస్తున్నాడని మహేష్ మురిసిపోతున్నాడు. బహుశా పిల్లలు ఎదుగుతున్న సమయంలో తండ్రి సిగరెట్లు తాగడం బాగోదని భావించినట్టున్నాడు. ఎంత మంచి నిర్ణయం కదా!

దువా? అయినా నీకేం తెలుస్తుందిలే.. నిన్న గాక మొన్నటి గుంట వెధవ్వి. ఇంకా చెబుతా విను.. నీకొచ్చిన సంబంధాలన్నీ ఏదో ఒక అవకరమైనవేనని నెమ్మదిగా ఆ పార్థుగాడితోటి చెప్పి తద్వారా నీకు తెలిసేట్టు చేస్తున్నాడు. తెలుసా? ఆమధ్య వీడి పెళ్లాం వచ్చి ఆ కబురూ ఈ కబురూ చెప్తూ, తెచ్చిన మినపసున్ని నా చేతికిచ్చి మా సుబ్బలక్ష్మి చేసింది చూడండి దొడ్డమ్మగారూ అన్నప్పుడు కానుకోలేకపోయాను. నెలనాడో..రెణ్నెళ్లనాడో వీడొచ్చి నన్నడగకపోయినా మన పెరట్లో అరటి చెట్లకి పాదులుచేస్తే అనుమానించలేకపోయాను. ఇప్పటికిప్పుడు ఇవ్వేళ వాణ్ని నమ్మకంగా కుర్చీపీట మీద కూర్చోబెట్టిన తరువాత గానీ నాకు జ్ఞానోదయం కాలేదు"

"ఏమి జ్ఞానముదయించిందో చెప్పవే బామ్మా నేనూ తెలుసుకొని సంతోషిస్తాను"

"ఏమి జ్ఞానమా... ఇక నుంచీ నువ్వా కూష్మంగాడి ఇంటి చాయలకు వెడితే నీ కాళ్లూ, ఆ కూష్మంగాడు మన ఇంటి చాయలకు వస్తే వాడి కాళ్లూ చేతులూ కూడా విరిచి మండే పొయ్యిలో పెట్టాలనీ, నీకు వెంటనే పెళ్లి చేయాలనీ జ్ఞానోదయమైందిరా భడవాకానా?"




★ ★ ★

"బామ్మా ... బామ్మా...ఎక్కడున్నావే! ఒకసారిలా బయటకురా!"

"ఎవరదీ...కాముడూ నువ్వేనా, బయటకు రావడానికి కుదరదురా! మడిలో ఉన్నాను"

"తప్పదు, ఎలాగోలా బయటకు రావల్సిందేనే"

"అబ్బా...ప్రాణం తీస్తాడు పిచ్చిగున్న! కాసేపు ఆగలేవురా వెర్రి నాగన్నా! వస్తున్నా...వస్తున్నా"

"......"

"ఏమిటి నాయనా అల్లరీ! చిన్న పిల్లవాడిలాగా! ఆ..ఆ..ఆ...ఇదేమఘాయిత్యంరా కాముడూ? ఆ పసుపు బట్టలేమిటీ! ఆ మెళ్లో దండలేమిటీ? నీ పక్కన అదెవత్తిరా! దాని మెళ్లో పసుపుతాడదీ కనబడుతోంది. కొంపదీసి దీన్ని గానీ పెళ్లిచేసుకున్నావేమిట్రా? ఇది ఆ కూష్మంగాడి పెద్దకూతురు సుబ్బి కాదా! ఏమే మీ నాన్న నేననుకున్నంత పనీ చేశాడన్నమాట. నోట్లో నాలుకలేని నా మనవడికి మందో మాకో పెట్టి వాళ్ల వశం చేసుకొని నిన్ను కట్టబెట్టారన్నమాట మీ అమ్మా అబ్బలు. అయ్యో.. అయ్యో ఎంతపని చేశారే వాళ్ల మొఖాలు మండా? ఇంతకు ఇంతా అనుభవించకపోరు"

"అదికాదండీ మామ్మగారూ...వీరు...మీ మనవడు గారూ..వీరే..తొందరపెట్టీ..."

"ముందు నోరుముయ్యి అప్రాచ్యురాలా...నోరు కుట్టెయ్యగలను"

"బామ్మా ఇందులో సుబ్బి తప్పుగానీ కూష్మాండం మావయ్య దంపతుల తప్పుగానీ ఏమీ లేదే. తప్పంటూ ఏమన్నా ఉంటే అది పూర్తిగా నాదే. ఇదంతా పూర్తిగా నా ఇష్టం మేరకు నా ప్రోద్బలంతోనే జరిగింది. నీకు తెలిస్తే నువ్వు కాదంటావేమోననే భయంతో గుళ్లో పెళ్లి చేసుకున్నాం. నీకు ఇష్టమయ్యి నువ్వు రమ్మంటే లోపలికొస్తాం. లేదంటే ఇటు నుంచిటే బయటకెళ్లిపోతాం. ఇంకెన్నటికీ ఈ ఇంటిగడప తొక్కం"

"హరి హరీ అవేం మాటల్రా కాముడూ! ఒరే నాయనా ఇంత ఆస్తీ హంగూ ఆర్భాటం ఉండీ గుళ్లో పెళ్లి చేసుకోవాల్సిన ఖర్మ నీకేం పట్టిందిరా? నువ్వా పిల్లంటే ఇంత ఇదిగా ఉన్నావని తెలిస్తే నేనే స్వయంగా ఈ పెళ్లి మన ఇంట్లో చేయించకపొయ్యేదాన్నా! ఒరే కాముడూ నువ్వంటే నాకేమన్నా కోపమో, కక్షో ఉంటుందిట్రా వెర్రివాడా! కాకపోతే చిన్నప్పుడే తల్లినీ తండ్రినీ పోగొట్టుకున్నావన్న మమకారంతో నిన్నెక్కువ గారాబం చేస్తే చెడిపోతావనే భయంతో అడపాదడపా అదుపు చేస్తున్నాను. అంతేగానీ నాకు మాత్రం నువ్వు తప్ప ఇంకెవరున్నార్రా, ఈ లోకం మొత్తంలో నాకు కావల్సింది ఒక ఎత్తయితే, నీ సుఖం రెండెత్తులు. కాటికి కాళ్లుచాచుకు కూర్చున్న నాకు అంతకంటే కావల్సింది మాత్రమేముంది. నాకు గోలోకమైనా నీ ఆనందం తరువాతేరా! పిచ్చికుంకా! ఎంత అపార్థం చేసుకున్నాంరా నన్ను నువ్వూ, నిన్ను నేనూను. ఒక్కగానొక్క మనవడి పెళ్లి చూడలేకపోయిన దౌర్భాగ్యురాలిగా నన్ను మిగల్చడానికి భగవంతుడు చేసిన ఎత్తు తప్ప ఇది మరేంకాదు సుబ్బూ. ఒక్క క్షణం ఆగండే మీ అమ్మనొచ్చి దిష్టి తీయమని కబురు పెడతాను"

○

## తీరిన కోరిక!

ఇటీవల రంభ వివాహం కెనడాకి చెందిన భారతీయ వ్యాపారవేత్త ఇంద్రన్‌తో జరిగిన సంగతి అందరికీ తెలుసు కదా! రంభకి వెంకటేశ్వర స్వామి అంటే ఎంతో భక్తిభావంట. తన పెళ్లి ఎప్పుడు జరిగినా అది ఆ ఏడుకొండల స్వామి సన్నిధిలోనే జరగాలను ఎన్నాళ్లుగానో కోరుకుందిట రంభ. ఇన్నాళ్లకి ఆమె అనుకున్నట్టుగానే తిరుమలలోనే వివాహం జరిగింది. దీంతో తన చిరకాల వాంఛ నెరవేరినందుకు ఎంతో సంతోషంగా వుందని తెగ సంబరపడుతూ చెప్పుకుంది రంభ.

